❖•❖•❖ 33 ❖•❖•❖

# యేసు సిలువను మోసిన సీమోను

*"వారాయనను తీసికొనిపోవుచుండగా పల్లెటూరినుండి వచ్చుచున్న కురేనీయుడైన సీమోనను ఒకని పట్టుకొని, యేసు వెంట సిలువను మోయుటకు అతనిమీద దానిని పెట్టిరి" (లూకా 23:26).*

పిలాతు సిలువవేయబడుటకై యేసును ప్రధానయాజకులకును యూదులకును అప్పగించాడు (యోహాను 19:16). వారాయనను, యింకా యిద్దరు దొంగలతో, కలువరి గిరికి, సిలువవేయబడుటకు ఏర్పాటుచేయబడిన చోటుకు, ఒక విధమైన ఊరేగింపుగా తీసికొనివెళ్లారు. మరణ శిక్ష విధింపబడిన నేరస్తుడు వాని సిలువను వాడే మోసికొనివెళ్లుట ఒక వాడుకయై యుండినది. యేసు తన సిలువను తానే మోసికొని వెళ్లాడని మత్తయి, మార్కు, మరియు లూకా పేర్కొన్నప్పటికిని, యోహాను పేర్కొన్నాడు. "వారు యేసును తీసికొనిపోయిరి. ఆయన తన సిలువను మోసికొని కపాలస్థలమను చోటికి వెళ్లెను. హెబ్రీ భాషలో [అరమెయిక్ భాషలో; NIV] దానికి గొల్గొతా అని పేరు" అని యోహాను వ్రాస్తున్నాడు (యోహాను 19:17).

మార్గములో ఎక్కడో ఒక చోట, బహుశ గవిని దాటగానే అయియుండవచ్చును, యేసు ఆయన మోయుచుండిన సిలువ భారమునుబట్టి నేలకు ఒరిగియుంటాడు. ఆయన దాని బరువునుబట్టైనా నేలకు ఒరిగియుండాలి లేదా దాని బరువును మోయుటకు ప్రయాసపడియుంటాడు గనుక యేసుకు సహాయంగా ఏమైనా చేయాల్సిందేనని సైనికులకు అర్థమైపోయింది. ఎంతైనా, వారు ఆయనను సిలువవేయక ముందే ఆయన చావాలని వారు కోరలేదుకదా!

సిలువ మోయుటకు "వారు అతనిని బలవంతము చేసిరి" అని మత్తయి మరియు మార్కు వ్రాశారు (మత్తయి 27:32; మార్కు 15:21). అయితే లూకా, "ఒకని పట్టుకొనిరి" అని వ్రాస్తున్నాడు (లూకా 23:26) అతని పేరు సీమోను.

వారికి సహాయం అవసరమైనప్పుడు ఏంచేయాలో ఈ సేనా భాగము ఎరిగియుండెను. ఊరేగింపు వెళ్లుచుండిన మార్గంలో వారికి సహాయం చేయడానికి తగిన బలముగలవారెవరైనా కనబడవచ్చునేమో అని దారి వెంబడి బారులు తీరియున్న ప్రజలను చూశారు. సైనికులు వెదకుచుండిన వ్యక్తి కనబడగానే, వారు చేయాల్సిదెల్లా ఏమంటే ఆ వ్యక్తి దగ్గరికి వెళ్లి అతనిని తన బల్లెముయొక్క కొనతో వాని భుజము మీద తట్టి, అతడు ముందుకు వచ్చి సిలువను మోయాల్సిందని ఆజ్ఞాపించడమే, సరికదా ఆ ఆజ్ఞనతడు శిరసావహించాల్సిందే. కొంత కాలంగా పాలస్తీనా దేశము రోమా ప్రభుత్వ ఆక్రమణలో ఉండినది, అవసరమైన విధంగా ఎవరినైనాగాని పనులు చేయవలెనని ఆజ్ఞ ఇచ్చుటకు ఈ ఆక్రమణా అధికారులకు సర్వహక్కులుండినవి. అనగా, ఆక్రమణ సైనికునికి ఏ సమయంలోనైనా ఎవరైనా సహాయం చేయాల్సిన అవసరం ఏర్పడినట్లయితే, అతడు సహాయం చేయాల్సిందే.

యేసు సిలువను మోసినవాడు కురేనీ పట్టణానికి చెందినవాడు, అది ఆఫ్రికా దేశం

ఉత్తర భాగంలో కొద్దోగొప్ప ప్రాముఖ్యమైన పట్టణమే, మొదటి శాతాబ్దపు చరిత్రకారుడైన యోసిఫస్ ప్రకారము, కురేనీలో ఉండిన యూదుల జనాభా అధికమే. “సీమోను” అను పేరు మౌలికంగా యూదుల పేరు, గనుక సీమోను యూదుడని ఈ పేరు తెలియజెప్పుచున్నది. సిమోను “పల్లెటూరి నుండి వచ్చుచుండెను” అని లూకా చెప్పుచున్నాడు (లూకా 23:26). యెరూషలేము, పస్కాపండుగ సమయములో, దాని మాములు జనాభా కంటె ఎన్నో రెట్లు అధికంగా జనసమ్మర్ధమైపోతుంది, గనుక సందర్శకుడు పట్టణంలో నివసించడానికి స్థలం దొరకడం కష్టం. బహుశ సీమోను యెరూషలేము పట్టణమునకు వెలుపల గల గ్రామీణ ప్రాంతంలోని తన బంధువులతోగాని స్నేహితులతోగాని నివసించియుండవచ్చును.

ఈ ప్రత్యేక ఉదయాన, సీమోను పస్కా పండుగ కొరకు సిద్ధపాటుగా యెరూషలేమునకు ప్రయాణమై వెళ్లుచుండెను, అప్పుడు అతడు యెరూషలేము పట్టణద్వారములలో ఒక దాని గుండా వెళ్లుచుండిన ఊరేగింపును చూశాడు. ఆతడు ఆ ఊరేగింపేంటో, ఏంజరుగుతుందో నను జిజ్ఞాసతో చూడాలని జనసమూహానికి ఓరగా వెళ్లియుంటాడు. బహుశ ఆ ఊరేగింపు, యేసు అవసరమును తీర్చుటకే కాబోలు. దాదాపుగా సీమోను ముందే ఆగిపోయింది, సీమోను నిండైన ఆరోగ్యంగలవాడుగాను బలమైనవాడుగాను అగుపించియుంటాడు. ఊరేగింపుకు సీమోను వైపున ఉండిన సైనికుడు సిలువను మోయగలవాని కొరకు చుట్టూర చూచినప్పుడు, సీమోను కనబడ్డాడు. గనుక అతని బల్లెము కొనతో, సీమోను భుజమును తట్టుచూ, “నీవు ఈ మనుష్యుని సిలువ మోయవలెనని నేను నీకు ఆజ్ఞాపించుచున్నాను!” అని చెప్పియుంటాడు. గనుక సీమోను చేయునదేమీలేక, ముందుకు వెళ్లి, వంగి, సిలువనెత్తుకొని, సిలువ కొయ్యను యిద్దరి భుజాల మీద ఒక కాడిగా సమానము గావించుకొనుచు, యేసు వెనుక నడుచుకుంటూ వెళ్లాడు. వారు సిలువవేయబడు చోటుకు చేరుకొన్నప్పుడు, సీమోను తన భుజము మీద ఉండిన సిలువ భారమును దించుకొన్నాడు. అప్పుడు యేసును ఆ సిలువకు మేకులతో దిగగొట్టు ప్రక్రియ మొదలయ్యింది.

యేసు మోయుచుండిన సిలువను సీమోను గొల్గొతా వరకు మోసికొని వెళ్ళిన ఈ సంఘటన మూడు సువార్తలలోను కేవలం ఒక్క వచనములోనే వివరించబడింది (మత్తయి 27:32; మార్కు 15:21; లూకా 23:26). అది సంక్షిప్తంగాను దాదాపుగా సందర్భవశాత్తుగాను వివరించబడింది, కానీ అది ఎంత కరుణాస్పదమైనదిగాను అర్థవంతమైనదిగాను ఉన్నదికదా!

*సీమోను ఈ సిలువను మోయుట యేసు ఆయన స్పృశించువారెవరికైనా లేదా దేనికైనా తన మహిమననుగ్రహించునని మనకు సరిక్రొత్త విధానంలో గుర్తుచేయుచున్నది.* యేసు మొరటుగా తయారుచేయబడిన ఈ సిలువను, అవమానము మరియు మరణమును సూచించు సాధనమును మోయుచు, దానిని మహిమ గల సిలువగాను, మన రక్షణ సాధనంగాను మార్చాడు. ఆ నాటి ఉదయం సీమోను యెరూషలేములో ప్రవేశించినప్పుడు అతను ఒక అజ్ఞాత వ్యక్తియై యుండెను; కానీ, యేసు మోసిన సిలువను అతడు కూడ కొద్ది దూరమే మోసిన తరువాత, అతని పేరు శాశ్వత కీర్తిగల వారి జాబితాలో చెక్కబడింది. సువార్త ప్రకటించబడు ప్రతి చోట, సీమోను చేసిన వివరము విశేషంగా చర్చించబడుతుంది. యేసు చేసిన బలియాగముతో, అనగా లోకము ఎప్పుడైనా ఎరుగగల అతి గొప్ప సంఘటనతో, ఆయన నిరంతరము ముడిపడియుంటాడు. యేసు మూలమున, ఎవ్వరికీ ఊరూ పేరూ

తెలియని సీమోను, ఎన్నటికైనను మరువజాలని పేరుగలవాడుగా మార్చబడ్డాడు.

కేవలము వారు యేసుతో కలిగియుండిన సంబంధములనుబట్టి అన్ని యుగాలలోను అత్యంత పేరు ప్రఖ్యాతులుగాంచిన వారి జాబితాలో చేరియున్న వ్యక్తుల గూర్చిన కథలు బైబిలు పుటలు తెలియజెప్పును. ఉదాహరణగా కొన్ని మాత్రమే చూద్దాము; కానుక పెట్టెలో రెండు కాసులు వేసిన బీద విధవరాలు; యేసు జనసమూహానికి ఆహారం పెట్టుటకు ఐదు రొట్టెలు రెండు చిన్న చెపలు యిచ్చిన చిన్నవాడు; క్రీస్తు మరణించిన తరువాత ఆయనను అంగీకరించిన శతాధిపతి; ఇప్పుడు ఇతడు, యేసు సిలువను మోసిన సీమోను.

*ఇంకా, యేసు ముఖములోనికి చూచు ప్రతివాడు మార్చబడకుండా ఉండలేడని ఈ సంఘటన మనకు చూపించుచున్నది.* నిస్సందేహంగా, మార్గములో ఏదో ఒక చోట, యేసు లోక పాపము నిమిత్తమై తన ప్రాణమునర్పించుచు రక్తము చిందించుటకు గొల్గొతాకు వెళ్లుచుండినప్పుడు, సీమోను యేసు ముఖంలోనికి చూచియుంటాడు. దైవీక కటాక్షము చొప్పును, సీమోను చరిత్రలోని ఈ ప్రత్యేక సమయంలో యేసుకు సమీపంగా ఉండుటకు అనుమతించబడ్డాడు. ఈ అవకాశం బహు కొద్దిమందికి దక్కింది. ఖచ్చితంగా, యేసుతో తనకు కలిగిన ఈ ఆనందానుభూతిని సీమోను ఎన్నడూ మరిచియుండడు. అటుతరువాత అతడు యేసు పేరును వినియున్నట్లయితే లేదా యేసుని గూర్చిన ప్రసంగాలు విన్నట్లయితే, అతని మనస్సు ఒక్కసారి వెనక్కి అతడు గొల్గొతాకు వెళ్లుచుండిన మార్గములో యేసు సిలువను మోసిన ఆ మధుర క్షణాలను గుర్తుకు తెచ్చుకొని యుంటుంది.

అపొస్తలుల కార్యముల గ్రంథంలో, పెంతెకొస్తు దినాన ఆ కొప్ప ప్రసంగమును విన్నవారి జాబితాలో కురేనీయులు కూడా ఉన్నారు (అపొస్తలుల కార్యములు 2:10). దీనికి అదనంగా, క్రైస్తవత్వము రోమా సామ్రాజ్యమందంతటను విస్తరించుచుండిన ఆ రోజుల్లో కురేనీయులును సువార్త ప్రకటనలో నిమగ్నమై యుండిరని లూకా చిత్రీకరిస్తున్నాడు (అపొస్తలుల కార్యములు 13:1). యేసు సిలువను మోయుట సీమోను మోయుట ఈ సంఘటనలపై ఏమి ప్రభావము చూపించిందో ఎవరికి ఎరుక?

*ఇంకా, మనము ఆయనను సన్నుతించుట కంటె ఎన్నోరెట్లు ఎక్కువగా యేసు మనలను ఆశీర్వదిస్తాడనునది ఈ ఉదంతము బయలుపర్చుచున్న మరొక సత్యమై యున్నది.* యేసు తన కొరకు తానే చేసుకొనలేకపోయిన దానిని సీమోను యేసు కొరకు ఏదో ఒకటి చేశాడు. సీమోను చర్య, అతడు అలా చేయాలని బలవంతము చేయబడినప్పటికిని, ఒక విశిష్టమైన చర్యయై యున్నది. ఆ కాలంలోని ఈ క్షణంలో, యేసు సిలువను మోయుటకు ఆయనకు ఎవరో ఒకరు కావలసివచ్చింది; సీమోను, అందుబాటులో ఉండి, సిలువను మోయవలెనని ఆజ్ఞాపింపబడ్డాడు – చెప్పబడిన పనిని మారుమాట్లాడక చేశాడు. రోమా సైనికుడు అతనిని తనకు అనుకూలంగా ఉపయోగించుకొంటున్నాడని అతడు మొదట అనుకొనియుంటాడు: ఎంతైనా, అతడు ఉత్తర ఆఫ్రికా దేశస్థుడైయుండెను, యెరూషలేము కాపురస్తుడు కాదు. ఏదిఏమైనా, సీమోను సిలువను మోయుచు అతని ముందరనున్న వ్యక్తిని గమనించుచుండగా, ఇతరులలో లేని ఏదో ఒక ఆశ్చర్యకరమైన భిన్న విషయం ఆయనలో ఉన్నదని సీమోను కనిపెట్టాడనుటలో సందేహమేమీ లేదు. అతడు ఆయన గూర్చి ఏదో ఒకటి నేర్చుకొని యుంటాడు – యేసు మాటలను వినుట ద్వారానే నేర్చుకొనాలనేమీ లేదు – కానీ ఆయన ప్రవర్తనను, వ్యక్తిత్వమును, మరియు ఇతరులందరికంటె ఆయన వేరైనవాడై యున్నాడని

చూపించుచుండిన వేషభాషలను జాగ్రత్తగా గమనించుట ద్వారా నేర్చుకొనియుంటాడు.

క్రొత్త నిబంధనలోని అటుతరువాతి కథలో, సీమోను కుమారులు మార్కు వ్రాసిన సువార్త చదువరుల మనస్సుల్లో గొప్ప ప్రజాదరణ పొందినవారై యుండిరని చెప్పుకొనబడ్డారు. వారు క్రైస్తవులుగాను సంఘములో సుపరిచితులైనవారై యుండుటనుబట్టే కాబోలు మార్కు వారిని తన రచనలో చేర్చాడు (మార్కు 15:21). మొత్తంమీద సీమోను సహితము క్రైస్తవుడై యుండుట సంభవమే. పౌలు రోమీయులకు వ్రాసిన తన పత్రిక ముగింపులో పేర్కొన్న రూపు (రోమీయులకు 16:13) బహుశ సీమోను కుమారుడై యుంటాడు. సీమోను యేసు సిలువను మోశాడన్న వాస్తవము అతన్ని సుప్రసిద్ధునిగా మాత్రమే చేయలేదు, కానీ, అతడు యేసును గూర్చి నేర్చుకొనుట మొదలుపెట్టుటకును దానిని మోయుటలో సీమోను సహాయపడిన సిలువ ద్వారా సమస్త మానవులకు యేసు అనుగ్రహించు రక్షణను ఎరుగునట్లును వీలు కల్పించినది. అది సీమోనుపై చెప్పుకోదగినంత – అతనిని మాత్రమే గాక అతని కుటుంబమంతటిని కూడ క్రీస్తు నొద్దకు నడిపించునంతగా – ప్రభావము చూపియుండును.

అతని కుటుంబ సభ్యులందరు క్రీస్తును వ్యక్తిగత రక్షకునిగా అంగీకరించి క్రీస్తు కొరకు విశ్వాస సహితమైన జీవితములు జీవించవలెననునది దైవభక్తిగల ఒక తండ్రి యొక్క గాఢమైన హృదయ వాంఛయై యున్నది. అతని పిల్లలు దారి తప్పి దుష్ట మార్గములోనికి వెళ్లుటయే అన్నిటినిమించి అతని హృదయాన్ని బ్రద్దలు చేసే ఒక బాధయై యున్నది. దీనికి భిన్నంగా, అతని పిల్లలు దేవుని కొరకును ఆయన సత్యము కొరకును తృష్ణగొనియున్నారని ఎరుగుటయే. అన్నిటిని మించి అతని హృదయానికి అమితానందమునిచ్చే ఒక అనుభూతియై యున్నది. సీమోను యేసు సిలువను మోశాడు; దానికి ప్రతిఫలము, యేసు అతడును అతని ఇంటివారందరును రక్షణ పొందుట కొరకు మార్గమును సరాళము చేశాడు. ఏ కుటుంబమైనా అనుభవించగల అతి గొప్ప ఆనందము యిదే.

*ఇక ఆచరణాత్మకమైన అంశానికొస్తే, సీమోను చేసినట్లే మనము కూడ ఏదో ఒకటి చేయాలని ఈ సంఘటన మనకు గుర్తుచేయుచున్నది.* యేసు కొరకు సరిగ్గా సీమోను చేసిన పనే ఎవరునూ చేయలేరు; అట్లయినప్పటికిని, ఒక విధంగా మనము మన దైనందిన జీవితంలో యేసు సిలువను మోయుటకు – అనగా, సిలువ వలన కలుగు అవమానమును అపనిందను భరించుచు సహించుచు యేసు అడుగుజాడలయందు నడుచుకొనుటకు, మనము పిలువబడి యున్నాము. మనము మన సిలువలనెత్తుకొనవలెను, అనగా మనము యేసు చేసినదే చేయుటకును యేసు జీవించినట్లే జీవించుటకును తీర్మానించుకొనవలెనని దీని యథార్థ అర్థమై యున్నది. యేసు తనకు తాను దేనిని చేసికొనలేకపోయాడో దానిని ఆయన కొరకు సీమోను చేశాడు; అలాగే, మన చుట్టూర ఉన్న వారికి ఉపచారము చేయు యేసు యొక్క ఆధ్యాత్మిక శరీరంలోని కాళ్లు చేతులు మొదలగు అవయవములముగా మనము ఈ లోకంలో జీవించుచున్నాము. ఈ విధంగా, యేసు ఈ లోకంలో తన కొరకు తానే ఏమీ చేసుకొనలేడో దానిని మనము చేయుదుము. మనము యేసు కొరకు ఆయన సిలువను మోయుచు, సకల సృష్టికి సువార్తను ప్రకటించుచున్నప్పుడు. ఆయనను వెంబడించుచున్నవారమౌదుము.

ఆ నాటి ఉదయం సీమోను యెరూషలేములో ప్రవేశించుచుండగా, పస్కాను ఆచరించవలెనని అతడు ఎంతో గొప్ప ఆనందంతో ఎదురుచూచియుంటాడు. బహుశ అట్టి ప్రత్యేకార్హతను అతడు అంతకు మునుపు అనుభవించి యుండకపోవచ్చును. అతని

జీవితంలోని ఈ ప్రత్యేక రోజు అతనికి అతి గొప్ప రోజుగా, నిస్సందేహంగా అతన్ని, అతని కుటుంబాన్ని, మరియు లోకమును సహితము మార్చిన ఒక రోజుగా, మారుతుందని అతనికి ఏమాత్రమును తెలియదు.

❖◆❖◆❖

*యేసు సిలువను మోయుటకు సీమోను "బలవంతము చేయబడ్డాడు" (మత్తయి 27:32; KJV). "ఇటువంటి బలవంతమునకు గల పదము అగ్గరెయున్. చివరకు ఈ పదము ఆక్రమణదారులకు సంబంధించిన ఏదైనా సేనాదళంలో పనిచేయుటకు బలవంతంగా నిర్బంధించుటను సూచించునదయ్యింది. ఆక్రమించుకొనబడిన దేశంలోని పౌరులు ఆహారము సరఫరా చేయుటకు గాని, సైనికులు భోజనంచేసి విశ్రాంతి తీసుకొను గృహములు నిర్మించుటకుగాని, సామానులు మోయుటకుగాని, బలవంతము చేయుబడవచ్చును. కొన్ని పర్యాయములు ఆక్రమణచేసిన అధికారులు బలవంతముచేయు ఈ హక్కును ఒక ఘోరమైన నిరంకుశమైన మరియు సహానుభూతిలేని పద్ధతిలో చెలాయించారు. బలవంతము చేయుబడుదురను ఈ బెదిరింపు పౌరుల మనస్సుల్లో ఎల్లప్పుడు స్థిరనివాస మేర్పరచుకొన్నట్లుండినది. ఇలా ఆక్రమణకు గురైన దేశాల్లో పాలస్తీనా ఒకటి. ఏ క్షణంలోనైన రోమా బల్లెము యొక్క కొన ఒక యూదుని భుజముపై పెట్టబడినప్పుడు, రోమీయులకు పరిచారము, అది అత్యంత నీచమైన విధానములో ఉండినను, చేయుటకు అతడు బలవంతము చేయుబడుచున్నాడని గ్రహించవచ్చును. వాస్తవమునకు, అతడు యేసు సిలువను మోయవలెనని బలవంతము చేయబడినప్పుడు, కురేనీయుడైన సీమోను విషయంలో జరిగింది కూడా ఇదే."[1]*

---

సూచన

[1]William Barclay, *The Gospel of Matthew,* vol. 1, The Daily Study Bible series (Philadelphia: Westminster Press, 1958), 166.